www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం

ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 29 | పేజీలు : 04 | గురువారం 19 - 11 - 2026 | వెల : 01/-



తెలంగాణ నీటి హక్కుల విషయంలో

రాజీపడే ప్రసక్తే లేదు

- నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్
- బీఆర్ఎస్ అబద్ధాలు చెప్పడం మానుకోవాలి
- తెలంగాణ నీటి వాటాలో చుక్క నీటిని కూడా వదులుకోం
- బీఆర్ఎస్ హయాంలో ఏపీకే అధికంగా నీటి వినియోగం
- కాంగ్రెస్ వచ్చాక తెలంగాణకే 24 టీఎంసీలు ఎక్కువమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కృష్ణా జలాల వినియోగంపై బీఆర్ఎస్‌కు ఉత్తమ్ కౌంటర్



హైదరాబాద్ :

'తెలంగాణ నదీ జలాల్లో చుక్క నీటి వాటాను కూడా వదులుకోం. బీఆర్ఎస్ హయాంలోనే కృష్ణా జలాలను ఏపీ ఎక్కువగా వాడుకుంది. మేం వచ్చాకనే తెలంగాణ ఎక్కువ నీళ్లను వినియోగించుకుంటోంది. బీఆర్ఎస్ అబద్దాలు చెప్పడం మానేయాలి' అంటూ నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.తెలంగాణ ప్రజలకు అబద్ధాలు చెబుతోంది. కేటీఆర్ మాటలు తీవ్రంగా ఖండిస్తున్నాను. కేంద్ర జల్ జీవన్ మంచి నీటి పథకం కింద ఏపీ.. 1.8 ఎంజీ లు తరలించే పనికి శ్రీకారం చుట్టింది. దీనిని మేము వ్యతిరేకిస్తున్నాం. దీనిపై కేంద్రానికి, కేఆర్ఎంబీకి మా అభ్యంతరాలు చెప్పాం. ఆ పనులు ఆపించడానికి అన్నీ విధాలుగా ప్రయత్నిస్తున్నాం. మేము మీలా ఏపీ పార్టీలు, నేతలతో లాలూచీ పడే వ్యక్తులం కాదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కృష్ణా జలాలను ఏపీయే ఎక్కువగా వినియోగించుకుంది. కృష్ణా నుంచి ఏపీ 4460 ఎంజీలు తరలిస్తే తెలంగాణ 1993 ఎంజీలు మాత్రమే వినియోగించుకుంది. మేం వచ్చాక ఏపీ 98.16 ఎంజీలు తరలిస్తే.. తెలంగాణ 122.74 ఎంజీ వినియోగించుకుంది. - మిగతా 2 లో



ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న కేటీఆర్
- సాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 90 టీఎంసీల నీటి మళ్లింపునకు యత్నిస్తోందని ఆరోపణ
- జల్ జీవన్ మిషన్ పేరుతో నీటి వినియోగానికి కేంద్రం సహకరిస్తోందని విమర్శ

హైదరాబాద్ :

తెలంగాణ సాగునీటి, తాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. - మిగతా 2 లో

ఏపీ టన్నెల్ ప్రాజెక్ట్‌పై తెలంగాణ

సర్కార్ ఎందుకు మౌనంగా ఉంది?



- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత
- నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ జలాల వివాదంపై కవిత స్పందన
- రేవంత్ రెడ్డి అనుమతితోనే ఈ పనులు జరుగుతున్నాయా అని నేరుగా ప్రశ్న
- భారీ నిర్మాణ పనులపై ప్రభుత్వానికి కనీస నిఘా సమాచారం లేదా అని నిలదీత

హైదరాబాద్ :

నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టన్నెల్ పనులు చేపట్టినా రేవంత్ ప్రభుత్వం మౌనంగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. పొరుగు రాష్ట్రం ఇంత పెద్ద ఎత్తున ప్రాజెక్టు పనులు చేపడుతున్నా రేవంత్ - మిగతా 2 లో

ఆయుష్మాన్ భారత్ ప్యాకేజీలను

112కు పెంచాలని యోచన!

- మోదీ సర్కార్ కీలక నిర్ణయం
- ప్రభుత్వ ఆస్పత్రులకు కేటాయించిన పీఎం
- జేఏవై ప్యాకేజీలను 112కు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది



ఢిల్లీ :

ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన చికిత్సల పరిధిని గణనీయంగా పెంచాలని మోదీ సర్కార్ యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను - మిగతా 2 లో

కశ్మీర్‌లో భద్రతా

దళాల భారీ విజయం



- మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ లతీఫ్ భట్ హతం
- కుల్గాం ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబా 'కేటగిరీ-ఎ' ఉగ్రవాది లతీఫ్ భట్ హతం
- మసీదులో నక్కిన అతడు లొంగిపోవడానికి నిరాకరించి కాల్పులు జరపిన వైనం
- కశ్మీర్ లోయలో మిగిలిన ఏకైక స్థానిక ఉగ్రవాది లతీఫ్ భట్
- లష్కర్‌లో చేరిన సరిగ్గా ఏడాదికి లతీఫ్ అంతం
- పోలీస్ అధికారి, ఇద్దరు వలస కార్మికుల హత్యల్లో ఇతడికి ప్రమేయం

ఢిల్లీ :

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన భారీ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబా మోస్ట్ వాంటెడ్ 'కేటగిరీ-ఎ' ఉగ్రవాది లతీఫ్ భట్ (23) హతమయ్యాడు. స్థానిక మసీదులో నక్కి ఉన్న అతడిని ప్రాణాలతో పట్టుకునేందుకు వీడియో కాల్ ద్వారా లొంగిపోవాలని బలగాలు అవకాశం ఇచ్చినా నిరాకరించాడు. బలగాలపైకి కాల్పులు జరపడంతో భద్రతా సిబ్బంది - మిగతా 2 లో

ఎస్బీఐ ఖాతాదారులకు అలర్ట్

- నేడు తెల్లవారుజామున యూపీఐ సేవలు బంద్
- నవంబర్ 19 తెల్లవారుజామున 1:15 నుంచి 2:00 వరకు యూపీఐ బంద్
- షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ కారణంగా సేవలకు తాత్కాలిక అంతరాయం
- గూగుల్ పే, ఫోన్‌పే వంటి యాప్స్‌లో ఎస్బీఐ యూపీఐ పనిచేయదు
- యూపీఐ లైట్ సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయి
- చిన్న లావాదేవీల కోసం యూపీఐ లైట్ వాడుకోవాలని ఎస్బీఐ సూచన

2 లో..

కోళ్లలో బర్డ్‌ఫ్లూ నివారణకు

తొలి స్వదేశీ టీకా రెడీ!

- కోళ్లలో బర్డ్‌ఫ్లూ నివారణ కోసం తొలి స్వదేశీ హెచ్5ఎన్1 టీకా
- నవంబర్ 20న భోపాల్‌లో విడుదల చేయనున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్
- ఈ ఇన్యాక్టివేటెడ్ టీకాను అభివృద్ధి చేసిన ఐసీఏఆర్-నిహ్సాడ్
- ఈ టీకాతో పౌల్ట్రీ రైతులకు తగ్గనున్న ఆర్థిక నష్టాలు



ఢిల్లీ :

కోళ్లలో ప్రాణాంతక బర్డ్‌ఫ్లూ వైరస్‌ను అడ్డుకునేందుకు భారతదేశం చారిత్రక విజయాన్ని సాధించింది. దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ హెచ్5ఎన్1 (క్లేడ్ 2.3.2.1ఎ) బర్డ్‌ఫ్లూ టీకాను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నవంబర్ 20న జాతికి అంకితం చేయనున్నారు. - మిగతా 2 లో

ప్రజల ప్రాణాలే

తొలి ప్రాధాన్యత



- శుక్రవారం మధ్యాహ్నం తీరం దాటనున్న అక్వాన్ తుఫాను
- అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన అనిత
- విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడి

అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీవ్ర తుపానుగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఈ తుపాను ముప్పుపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో రాబోయే 48 గంటల పాటు రాష్ట్ర యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ప్రస్తుతం ఈ తుపాను గంటకు 3 కిలోమీటర్ల మందగమనంతో కదులుతూ మరింత బలపడుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు – విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం - మిగతా 2 లో



ఏపీకి జంట తుపాన్ల వేళ

కర్ణాటక పెద్ద మనసు

- సీఎం డీకే శివకుమార్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు
- విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణలో అండగా నిలిచిన కర్ణాటక సిబ్బంది
- 68 బృందాలుగా 592 మంది ఏపీకి వచ్చి పనులు
- విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించడంలో కీలక పాత్ర

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన 'అర్నబ్', 'మురసు' జంట తుపాన్ల విధ్వంసం నుంచి కోలుకునే క్రమంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు సకాలంలో అండగా నిలిచిన కర్ణాటక ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు - మిగతా 2 లో

ఈసారి కూడా అదే

సమన్వయం ఉండాలి

- 23 పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలపై చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గ్రామస్థాయి నుంచి పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచన
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్ఘాటన



అమరావతి :

రాష్ట్రంలో జరగనున్న 23 పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ముఖ్య నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయి వ్యూహాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్రస్థాయిలో కూటమి పార్టీల మధ్య ఉన్న సఖ్యత, సమన్వయం క్షేత్రస్థాయిలోనూ కనిపించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రామస్థాయిలోనే బలమైన నాయకత్వం రూపుదిద్దుకోవాలని, స్థానిక సమస్యలకు అక్కడే పరిష్కారం లభించే వాతావరణం రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మంచి, చెడులను బేరీజు - మిగతా 2 లో

సంపాదకీయం

యుద్ధంలోనూ ఓడినట్టేనా..

మధ్యంతర ఎన్నికలు కాస్తదూరంగా ఉన్నప్పుడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాదాపు ప్రతీరోజూ ఇరాన్‌ను అమెరికాతో కాళ్ళబేరానికి రాకపోతే దుంపనాశనం తప్పదని బెదిరించేవారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఆయన స్వరంలో మార్పువచ్చింది. అవి ముగిసేవరకూ ఇరాన్‌మీద కయ్యానికి కాలుదువ్వనని హామీ ఇచ్చారు, మాట నిలబెట్టుకున్నారు కూడా. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి కనుక ఆయన మళ్ళీ భేరీలు మోగించాలి, రణనినాదాలు చేయాలి. కానీ, తిరిగి యుద్ధంలోకి దిగే, లేదా కొనసాగించే ఆలోచన తనకు లేదన్నట్టుగా ఆయన మాట్లాడుతున్నారు. తమ గల్ఫ్ మిత్రదేశాలు యుద్ధం వద్దంటూ అదేపనిగా ఒత్తిడిచేస్తున్నాయని, తాను కూడా కాలుదువ్వే ఆలోచనలో లేనన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం.ఇదంతా మధ్యంతర ఎన్నికల ఫలితాల ప్రభావమే అన్నది ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ట్రంప్ వీరంగాలను మిగతా ప్రపంచమంతా చేష్టలుడిగి చూస్తూంటే, అమెరికన్ ఓటరే ఆయనకు ముకుతాడు వేశాడు. ఇరాన్‌మీద తాము చేస్తున్నది యుద్ధం కాదనీ, అది ఎప్పుడు ముగుస్తుందో తెలియదని ఆ మధ్యన వ్యాఖ్యానించిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు కూడా ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణమే అది యుద్ధమేనని జ్ఞానోదయం కలిగింది. ఇరాన్‌తో పెట్టుకున్నందువల్లనే ఘోరంగా ఓడిపోయామని గోసపడ్డాడు ఆయన. వాన్స్ వ్యాఖ్యలు నిజమేనని అధ్యక్షులవారు కూడా ఒప్పుకుంటూనే, ఇరాన్‌వద్ద అణ్వాయుధాలు లేకుండా చేయడానికి యుద్ధం తప్పడం లేదని సమర్థించుకున్నారు. ట్రంప్, వాన్స్ మధ్య ఇరాన్ యుద్ధం అగాధాన్ని పెంచిందని, వాన్స్ తన రాజకీయ భవిష్యత్తు విషయంలో పునరాలోచనలో పడ్డారని, ఒకప్పుడు ట్రంప్ తరువాత కాబోయే అధ్యక్షుడు అనుకున్న ఈయన 2028 ఎన్నికల్లో పోటీచేయాలా వద్దా అన్న సంశయంలో మునిగితేలుతున్నారని వార్తలు విన్నాం. యుద్ధానికి దూరంగా జరుగుతూ ఇలా చేతులు దులిపేసుకుంటున్న వాన్స్‌ను ట్రంప్ ఇరాన్ చర్చల నుంచి తప్పించేసి, డెమోక్రాటిక్ పార్టీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో అవినీతి, నేరాలమీద పనిచేయమంటూ పంపేశారు. ఇరాన్‌ను అణ్వాయుధరహితం చేయడానికే యుద్ధమనీ, అది ఆగాలంటే ఇరాన్ దిగివచ్చి తనతో ఒప్పందం కుదుర్చుకోవాలని మొన్నటివరకూ అంతగట్టిగా చెప్పిన ట్రంప్ ఇప్పుడు ఎలాంటి ఒప్పందం అవసరం లేదంటున్నారు. ఇరాన్‌కు చెందిన వందల బిలియన్ డాలర్లు, హార్మూజ్ జలసంధి తన గుప్పిట్లోనే ఉన్నాయి కనుక, ఇరాన్ ఆర్థికవ్యవస్థ తనకు తానుగానే కుప్పకూలిపోతోంది కనుక యుద్ధం అవసరం లేకుండానే దానంతటదే దారికి వస్తుందంటున్నారు ఆయన. అన్ని సభల్లోనూ డెమోక్రాట్లకు అధిపత్యం కట్టబెట్టిన ఎన్నికల ఫలితాలే కాదు, సంప్రదాయ రిపబ్లికన్ ఓటర్లకు సైతం తనమీద మనసు విరిగిపోవడానికి ఇరాన్‌తో యుద్ధం, దాని పర్యవసానాలే కారణమని పలుసర్వేలు కూడా నిర్ధారించిన నేపథ్యంలో, మళ్ళీ ఆ జోలికి పోవద్దని ట్రంప్ అనుకొని ఉంటారు.గత పాలకుల మాదిరిగా ఎడతెగని యుద్ధాలు చేయనని, ఎవరి ప్రయోజనాలకోసమో అమెరికా సైన్యాన్ని, అమెరికన్ల కష్టార్జితాన్ని బలిపెట్టనని హామీ ఇచ్చి మరీ అధికారంలోకి వచ్చారు ట్రంప్. నోబెల్ పీస్ ప్రైజ్‌కు తనను మించిన అర్హులెవరూ లేరంటూ అది తనకు రానందుకు కూడా ఆగ్రహించారు, అలిగారు. ఇరాన్‌తో ఆయన యుద్ధం యావత్ ప్రపంచాన్ని తీవ్ర కష్టనష్టాల్లోకి నెట్టింది. 2018లో బరాక్ ఒబామా హయాంలో ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేసిన ఆయన, గత ఏడాది జూన్‌లో ఇరాన్ మీద ఇజ్రాయెల్‌తో కలిసి తానూ బాంబులేశారు. ఆ దెబ్బతో ఇరాన్ అణుకార్యక్రమాన్ని సమూలంగా నాశనం చేశానని గొప్పలు చెప్పుకొని, ఎనిమిదినెలలు కూడా తిరక్కుండా మళ్ళీ అదే అణు కార్యక్రమం పేరిట యుద్ధం ప్రకటించారు. హార్మూజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్ ఇంధనధరలు పెరిగేట్టు చేసి ట్రంప్ కాళ్ళకింద సెగరాజేయడంతో ఎన్నికల్లో ఓడిన ఆయన ఇప్పుడు వెనకడుగువేయాల్సి వచ్చింది. యుద్ధం, ఒప్పందం రెండూ అక్కరలేదన్న ఈ వైఖరి సరైనది కాదు. యుద్ధం ఆపేయాలని ఆయన నిజంగానే అనుకుంటున్నపక్షంలో దౌత్యం ద్వారా మాత్రమే దానిని ముగించాలి. అందుకు ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలి. అయితే, అందుకు తాను యుద్ధంలో ఓడిపోయానని ఒప్పుకోవాల్సి వస్తుంది కనుక, ఇరాన్ తనకు తానుగా కూలిపోతుందనీ, తాను అమలుచేస్తున్న దిగ్బంధంతో దారికి వస్తుందని ఆయన చెప్పుకుంటున్నారు. ఇంత సుదీర్ఘయుద్ధం తరువాత కూడా ఇరాన్ దిగిరాలేదు, తన డిమాండ్లను సడలించలేదు. మాట నిలకడ లేనితనానికి మారుపేరైన ట్రంప్ ఎంతకాలం ఈ మాటమీద నిలబడతారో చూడాలి.

ఏపీకి జంట తుపాన్ల వేళ కర్ణాటక పెద్ద మనసు

మొదటిపేజీ తరువాయి - హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు బుధవారం ఆయన అధికారిక లేఖ రాశారు. విపత్తు వేళ పొరుగు రాష్ట్రం చూపిన చొరవ, తక్షణ స్పందనను ఆయన లేఖలో ప్రత్యేకంగా ప్రశంసించారు.జంట తుపాన్ల తీవ్రతకు ఏపీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిని సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సంక్షోభ సమయంలో కర్ణాటక ప్రభుత్వం వెంటనే స్పందించి 68 బృందాలుగా 592 మంది విద్యుత్ సిబ్బందిని ఆంధ్రప్రదేశ్‌కు పంపించింది. స్థానిక సిబ్బందితో కలిసి ప్రతికూల పరిస్థితుల్లో పనిచేసిన కర్ణాటక బృందాలు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించాయని చంద్రబాబు కొనియాడారు.ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోనే తుపాన్ల



విధ్వంసం తీవ్రస్థాయిలో కనిపించింది. 'అర్నబ్' తుపాను కారణంగా 1,333 గ్రామాలు, 'మురసు' దాటికి 1,825 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే అర్నబ్ ప్రభావంతో 1,852 స్తంభాలు, మురసు ప్రభావంతో ఏకంగా 7,850 స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ వ్యవస్థకు పెను నష్టం వాటిల్లింది. ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో అర్నబ్ తర్వాత 165 బృందాల్లో 1,580 మంది, మురసు తర్వాత 390 బృందాల్లో 3,292 మంది స్థానిక సిబ్బంది రంగంలోకి దిగగా, కర్ణాటక నుంచి వచ్చిన బృందాలు వారికి అదనపు బలాన్ని చేకూర్చాయని సీఎం వివరించారు.ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అందించుకునే ఇలాంటి పరస్పర సహకారం ఇరు రాష్ట్రాల మైత్రిని మరింత పటిష్ఠం చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కర్ణాటకకు ఎటువంటి విపత్తులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా సిబ్బంది, యంత్ర పరికరాలు, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని లేఖలో హామీ ఇచ్చారు.

కశ్మీర్‌లో భద్రతా దళాల భారీ విజయం

మొదటిపేజీ తరువాయి - ఎదురుకాల్పులు జరిపి అతడిని అక్కడికక్కడే మట్టుబెట్టారు. ఈ ఆపరేషన్‌లో మసీదుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా బలగాలు అత్యంత సంయమనం పాటించాయి. కశ్మీర్ లోయలో మిగిలి ఉన్న ఏకైక క్రియాశీల స్థానిక ఉగ్రవాది అతడేనని భద్రతా వర్గాలు తెలిపాయి.సరిగ్గా



లష్కరే తొయిబాలో చేరిన ఏడాదికే లతీఫ్ భట్ అంతం కావడం గమనార్హం. 2025 నవంబర్ 18న ఉగ్రవాద బాట పట్టిన అతడు.. సరిగ్గా ఏడాది తర్వాత బలగాల చేతిలో హతమయ్యాడు. దక్షిణ కశ్మీర్‌లో లష్కర్ స్థానిక కమాండర్‌గా ఉంటూ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్), కశ్మీర్ రివల్యూషనరీ ఆర్మీ (కేఆర్ఏ) సంస్థలతో సంబంధాలు కొనసాగించాడు. ఉగ్రవాదంలోకి రాకముందు అతడు వడ్రంగిగా పనిచేశాడు. భాన్‌లో 8వ తరగతి, అష్ముజీలో 12వ తరగతి చదివి.. కుల్గాం ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో చేరి మధ్యలోనే మానేశాడు.దక్షిణ కశ్మీర్‌లో పలు దాడులకు ఇతడే ప్రధాన సూత్రధారి. జులై 22న అనంత్‌నాగ్‌లో ఓ పోలీస్ అధికారి హత్య, ఆగస్టు 1న కుల్గాంలో ఇద్దరు వలస కార్మికుల హత్యల్లో ఇతడి ప్రమేయం ఉంది. నవంబర్ 11న కుల్గాంలో సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టుపై దాడి చేసి ముగ్గురు జవాన్లను గాయపరిచాడు. ఈ దాడికి ముందు రెక్కీ నిర్వహించిన దృశ్యాలు సీసీటీవీల్లో నమోదయ్యాయి. గత ఐదారు నెలలుగా ఇతడికి ఆశ్రయం, లాజిస్టిక్స్ సమకూర్చిన స్థానిక సహచరుడు ఉమర్ నిసార్ దార్‌ను నవంబర్ 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో సైన్యం హతమార్చింది. అప్పుడు లతీఫ్ తప్పించుకున్నాడు.చివరకు పక్కా సమాచారంతో చేపట్టిన ఆపరేషన్‌లో అతడిని భద్రతా దళాలు అంతమొందించాయి. పాకిస్తాన్‌లోని ఇతడి హ్యాండ్లర్లు, ఆయుధాలు సమకూర్చిన నెట్‌వర్క్‌పై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కోళ్లలో బర్డ్‌ఫ్లూ నివారణకు తొలి స్వదేశీ టీకా రెడీ!

మొదటిపేజీ తరువాయి - భోపాల్‌లోని ఐసీఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (ఐసీఏఆర్-నిహ్సాడ్) శాస్త్రవేత్తలు ఈ ఇన్యాక్టివేటెడ్ టీకాను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం మన దేశంలో చెలరేగుతున్న క్లేడ్ 2.3.2.1ఎ రకం హెచ్5ఎన్1 వైరస్‌పై సమర్థవంతంగా పనిచేసే తొలి స్వదేశీ టీకా ఇదే కావడం విశేషం.కోళ్ల పరిశ్రమను కుదిపేసే హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (బర్డ్‌ఫ్లూ) బారిన పడ్డ పక్షుల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తాయి. వ్యాధి విస్తరణను అడ్డుకునేందుకు వేలాది కోళ్లను చంపాల్సి రావడంతో పౌల్ట్రీ రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. 2006లో భారత్‌లో ఈ వ్యాధి తొలిసారి వెలుగుచూసిన నాటి నుంచి ఇప్పటివరకు హెచ్5ఎన్1, హెచ్5ఎన్8 రకాలకు సంబంధించి 500 కంటే ఎక్కువ వ్యాప్తి ఘటనలు నమోదయ్యాయి. 2006 నాటి వ్యాప్తి వల్ల దేశంలో రూ.2,200 నుంచి రూ.3,000 కోట్ల మేర ప్రత్యక్ష, పరోక్ష నష్టం వాటిల్లింది. ఈ మహమ్మారి అదుపు తప్పితే దేశ జీడీపీ వృద్ధి రేటు 1.5 శాతం పడిపోయే ప్రమాదంతో పాటు 20 శాతానికి పైగా పౌల్ట్రీ రంగం ప్రమాదంలో పడుతుందని అంచనా.ఇది కేవలం కోళ్లకే పరిమితం కాకుండా ప్రజారోగ్యానికి కూడా పెను ముప్పుగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) లెక్కల ప్రకారం 2003 నుంచి ఇప్పటివరకు 25 దేశాల్లో 1,003 మానవ హెచ్5ఎన్1 కేసులు నమోదు కాగా, అందులో 479 మంది ప్రాణాలు కోల్పోయారు. భారత్‌లో నమోదయ్యే కేసుల్లో అత్యధికం క్లేడ్ 2.3.2.1ఎ రకం వల్లే వస్తున్నట్లు అధ్యయనాలు తేల్చాయి. ఇటీవల ఈ స్ట్రెయిన్ ఇతర జంతువులు, క్షీరదాలకు సైతం సోకుతుండటంతో పాటు ముగ్గురు మనుషుల్లోనూ కనిపించింది. ఇప్పటివరకు ఈ రకానికి మార్కెట్లో ప్రత్యేక వాణిజ్య టీకా అందుబాటులో లేదు. నిహ్సాడ్ శాస్త్రవేత్తలు రూపొందించిన ఈ సరికొత్త వ్యాక్సిన్ రాకతో పౌల్ట్రీ రంగానికి భారీ ఊరట లభించనుంది.

ఆయుష్మాన్ భారత్ ప్యాకేజీలను 112కు పెంచాలని యోచన!

మొదటిపేజీ తరువాయి - ప్రస్తుతమున్న 23 నుంచి 112కు పెంచాలని ప్రతిపాదించినట్లు నేషనల్ హెల్త్ అథారిటీ వర్గాలు తెలిపాయి. ఈ ప్రతిపాదిత విస్తరణ ప్రధానంగా సాధారణ అనారోగ్య సమస్యలు, సర్జరీలపై దృష్టి సారించనుందని వెల్లడించాయి. ఈ అనారోగ్య సమస్యలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో, ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ డివిజనల్ ఆస్పత్రుల్లో సమర్థవంతంగా చికిత్స అందించవచ్చని పేర్కొన్నాయి.ఆరోగ్య సంరక్షణ సేవలను లబ్ధిదారులకు మరింత చేరువ చేయడం, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడం కోసం ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను ప్రస్తుత మున్న 23 నుంచి 112కు పెంచాలని కేంద్రం యోచిస్తున్నట్లు నేషనల్ హెల్త్ అథారిటీ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరికరాలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బందితోనే వీటిలో చాలా చికిత్సలను అందించవచ్చని వెల్లడించాయి. రోగులకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఈ ప్రతిపాదన ప్రభుత్వ ఆరోగ్య సంస్థల బలోపేతానికి కూడా ఊతమిస్తుందని పేర్కొన్నాయి. ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స అందించినందుకు ప్రభుత్వ ఆస్పత్రులకు రీయింబర్స్‌మెంట్ లభిస్తుందని వెల్లడించాయి. ఈ నిధులను ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల బలోపేతానికి, వైద్య పరికరాల కొనుగోలుకు, మందులు, వినియోగ వస్తువుల లభ్యతను నిర్ధరించడానికి, నిర్వహణ ఖర్చులను భరించడానికి, అదనపు ఆరోగ్య నిపుణులను నియమించుకోవడానికి వినియోగించుకోవచ్చని చెప్పాయి."తమ ఇళ్లకు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో సమర్థవంతంగా అందించగలిగే చికిత్సల కోసం రోగులు సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా చూడటమే దీని ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో ఈ సదుపాయాలను ఎక్కువగా ఉపయోగించుకోవడం వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుంది. వైద్య, శస్త్రచికిత్సలకు సంబంధించి నేషనల్ హెల్త్ అథారిటీ అదనంగా 89 ప్యాకేజీలను గుర్తించింది. దీంతో ప్రతిపాదిత ప్యాకేజీల సంఖ్య 112కు చేరింది. ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సంస్థల ప్రస్తుత క్లినికల్ సామర్థ్యాల పరిధిలో నిర్వహించగల వైద్య చికిత్సలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం. అయితే దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండటం ముఖ్యం. ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. దూర ప్రాంతాల్లోని ఆస్పత్రు లకు వెళ్లాల్సిన అవసరం తగ్గడం వల్ల ప్రయాణ ఖర్చులు తగ్గుతాయి. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఇప్పటికే పెట్టిన పెట్టుబడులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఎక్కువ మంది రోగులకు సేవలు అందించేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని క్రమంగా పెంచడమే ఈ చొరవ ఉద్దేశ్యం" అని నేషనల్ హెల్త్ అథారిటీ వర్గాలు పేర్కొన్నాయి.

ఎస్బీఐ ఖాతాదారులకు అలర్ట్

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఖాతాదారులకు ముఖ్య గమనిక. సిస్టమ్ నిర్వహణ (షెడ్యూల్డ్ మెయింటెనెన్స్) పనుల కారణంగా నేడు తెల్లవారుజామున ఎస్బీఐ యూపీఐ సేవలు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి.బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం,నేడు తెల్లవారుజామున 1:15 గంటల నుంచి 2:00 గంటల వరకు దాదాపు 45 నిమిషాల పాటు యూపీఐ సేవలు అందుబాటులో ఉండవు. ఒకవేళ మెయింటెనెన్స్ పనులు నిర్దిష్ట సమయం కంటే ముందే పూర్తయితే, సేవలు అంతకంటే ముందే పునరుద్ధరించబడతాయి.ఈ 45 నిమిషాల వ్యవధిలో ఎస్బీఐ ఖాతాలతో లింక్ అయి ఉన్న సాధారణ యూపీఐ లావాదేవీలు నిలిచిపోతాయి. ముఖ్యంగా గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్‌ల ద్వారా ఎస్బీఐ ఖాతా నుంచి నగదు పంపడం లేదా స్వీకరించడం సాధ్యం కాదు.అయితే, వినియోగదారులకు పూర్తిగా ఇబ్బంది కలగకుండా యూపీఐ లైట్ సేవలు మాత్రం యథావిధిగా పనిచేస్తాయని బ్యాంక్ స్పష్టం చేసింది. అత్యవసర లేదా చిన్న మొత్తాల చెల్లింపుల కోసం ఖాతాదారులు ముందుగానే యూపీఐ లైట్‌ను యాక్టివేట్ చేసుకుని, అందులో నగదును లోడ్ చేసుకోవాలని ఎస్బీఐ అధికారులు సూచించారు.ఈ అంశంపై ఎస్బీఐ అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, "షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ పనుల కారణంగా 19.11.2026న తెల్లవారుజామున 01:15 గంటల నుంచి 02:00 గంటల వరకు ఎస్బీఐ యూపీఐ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవు. అయితే, ఈ పనులు షెడ్యూల్ కంటే ముందే పూర్తయ్యే అవకాశం కూడా ఉంది. అంతరాయం లేని సేవల కోసం ఖాతాదారులు యూపీఐ లైట్ సేవలను వినియోగించుకోవచ్చు. వినియోగదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నాం" అని పేర్కొంది.కాబట్టి, ఆ సమయంలో ఆన్‌లైన్ పేమెంట్లు చేయాలనుకునే వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని లేదా యూపీఐ లైట్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని బ్యాంక్ కోరింది.

ఈసారి కూడా అదే సమన్వయం ఉండాలి

మొదటిపేజీ తరువాయి - వేసుకుని తీర్పు ఇచ్చారని గుర్తుచేసిన ఆయన, ప్రభుత్వం చేపడుతున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఈ పంచాయతీ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరిస్తూ.. సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి ఇంటి అవసరాలను, గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, భారీ పెట్టుబడుల ద్వారా పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ--ఉపాధి అవకాశాలు, రోడ్ల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి అంశాల్లో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.ఇదే సమయంలో ప్రత్యర్థి పార్టీ విధానాలపై సీఎం చంద్రబాబు విమర్శలు గుప్పించారు. ప్రత్యర్థి పార్టీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలు, వివాదాస్పద వైఖరిని ప్రజలకు వివరించి అప్రమత్తం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల్లో ప్రతి ఓటూ ఎంతో కీలకమని, కూటమి కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలవాలని చెప్పారు. భవిష్యత్తులో రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నడవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

ప్రజల ప్రాణాలే తొలి ప్రాధాన్యత అన్న అనిత

మొదటిపేజీ తరువాయి - ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, కొన్ని సమయాల్లో గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు.ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని హోంమంత్రి ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు స్థానిక అగ్నిమాపక సిబ్బందిని క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని... ప్రజలకు పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, సమాచారం కోసం విపత్తు నిర్వహణ హెల్ప్‌లైన్ నంబర్ 1070 లేదా టోల్ ఫ్రీ నంబర్ 18004250101 ద్వారా సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది.

ఏపీ టన్నెల్ ప్రాజెక్ట్‌పై తెలంగాణ సర్కార్ ఎందుకు మౌనంగా ఉంది

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం ప్రభుత్వం ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని నిలదీశారు. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుండి అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం భారీ టన్నెల్ ప్రాజెక్ట్ చేపట్టినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదు అని ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుమతితోనే ఏపీ ప్రభుత్వం ఈ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టిందా అని నిలదీశారు. ఏపీ ప్రభుత్వం ఇంత భారీ ఎత్తున ప్రాజెక్టు పనులు చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదా అంటూ మండిపడ్డారు.

ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 90 టీఎంసీల కృష్ణా నది నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం ఉంటోందని కేటీఆర్ పేర్కొన్నారు.ప్రధానమంత్రి మోదీ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆయన విమర్శించారు. జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ చేపడుతున్న నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. గతంలో ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోందని అన్నారు.సాగర్ ప్రాజెక్టు వద్ద గత ఏడాది కాలంగా జరుగుతున్న పనులపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ నీటి మళ్లింపు యత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అధికారికంగా ఏమైనా ఫిర్యాదు చేశారా అని నిలదీశారు. అలాగే రాష్ట్ర తాగునీటి అవసరాల నిమిత్తం మిగిలిన 40 టీఎంసీల కేటాయింపులను కోరుతూ ప్రభుత్వం వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని అన్నారు.

తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదుఏపీ కంటే తెలంగాణయే 24 ఏజ అధికంగా వినియోగించుకుంది. బీఆర్ఎస్ దుష్ప్రచారం చేయడం మానుకోవాలి' అంటూ మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సోనియా ఆత్మకథపై కేటీఆర్ చేసిన విమర్శలకు సమాధానం చెప్పారు.'సోనియా గాంధీ లేకుండా తెలంగాణ రాష్ట్రమే లేదు. తెలంగాణ సోనియా గుండెల్లో ఉన్నందుకే రాష్ట్ర ఏర్పాటు జరిగింది. మీ పదవులు, ఆస్తులు, సంపద అంతా సోనియా తెలంగాణ ఇవ్వడం వల్లనే. అది మీ నాన్న అసెంబ్లీలో కూడా చెప్పారు' అంటూ ఆక్షేపించారు.

తీరం వైపు దూసుకొస్తున్న అక్వాన్ తుపాన్

రాష్ట్రంలో ఈ జిల్లాలకు భారీ వర్షసూచన

రాష్ట్రంపై అక్వాన్ తుపాన్ ప్రభావం పెద్దగా ఉండదని వాతావరణ శాఖ అధికారి తెలిపారు

కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మాత్రం భారీ వర్షసూచన ఉందన్నారు



అక్వాన్ తుపాన్ ప్రభావం తెలంగాణపై పెద్దగా ప్రభావం చూపదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రమే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. మిగతా జిల్లాల్లో మేఘావృతమైన ఆకాశంతో పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలోకి తేమ అధికంగా ప్రవేశిస్తుందని దీంతో రాష్ట్రంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావుతో ముఖాముఖిలో వివరించారు.తీవ్ర తుపాను అక్వాన్ ప్రస్తుతం పశ్చిమ బంగాళాఖాతంలో చెన్నైకి తూర్పు

ఎస్.కె.పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

2026--27 విద్యా సంవత్సరానికి కేటగిరీ--బి సీట్ల భర్తీకి నోటిఫికేషన్



గుంతకల్, నవంబర్ 18 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలోని ఎస్.కె.పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను కేటగిరీ--బి (స్పాట్ అడ్మిషన్లు) ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కాం (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎఫ్ఎస్ఐ), బీఎస్సీ (గణితం, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బాటనీ), బీఏ (ఎకనామిక్స్, హిస్టరీ, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నవంబర్ 19న ఖాళీ సీట్ల వివరాలను ప్రదర్శిస్తామని, అదే రోజు నుంచి నవంబర్ 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. నవంబర్ 23న ఎంపిక జాబితా ప్రకటించి, నవంబర్ 26, 27 తేదీల్లో ఫీజు చెల్లింపులు ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్ 25 నుంచి 27 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే నవంబర్ 30న రాటిఫికేషన్, డిసెంబర్ 1, 2 తేదీల్లో లోపాల సవరణ, డిసెంబర్ 4న తుది రాటిఫికేషన్, డిసెంబర్ 5న అడ్మిషన్ పోర్టల్ ముగింపు ఉంటుందని తెలిపారు. డిగ్రీలో ప్రవేశం పొందాలనుకునే అర్హులైన విద్యార్థులు నిర్దిష్ట గడువులో కళాశాలను సంప్రదించి స్పాట్ అడ్మిషన్ల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య సూచించారు.

అత్యవసర సమయంలో ఇద్దరు రక్తదాతల మానవతా సేవ

లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ చొరవతో కర్నూలులో రక్తదానం



గుంతకల్ నవంబర్ 18 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి: కష్టకాలంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ మరోసారి తన సేవా నిరతిని చాటుకుంది. కర్నూలు జిల్లాలోని మెడిక్యూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్ బాషా అనే రోగికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరం ఏర్పడింది. దీంతో బాధితులు గుంతకల్‌కు చెందిన లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆర్గనైజేషన్ ముఖ్య సభ్యులు కర్నూలు జిల్లా ఆదోని సమీపంలోని కమ్మరిచేడు గ్రామానికి చెందిన నజీర్‌ను సంప్రదించారు. ఆయన చొరవతో అదే గ్రామానికి చెందిన రక్తదాతలు దాదాపీర్ సాబ్, సిద్ధిరాం ముందుకు వచ్చి కర్నూలులోని అక్షయ్ బ్లడ్ బ్యాంకుకు చేరుకుని బి పాజిటివ్ రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన ఇద్దరు దాతలు మానవతకు ప్రతీకగా నిలిచారు.ఈ సందర్భంగా లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి రంజాన్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని అవసరమైన వారికి సహాయం చేయాలని కోరారు. రక్తదానం చేసిన దాదాపీర్ సాబ్, సిద్ధిరాంకు సంస్థ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఇంటింటికి ఒక రక్తదాత కావాలి.. రక్తదానం చేయండి.. నిండు నూరేళ్ల జీవితాన్ని కాపాడండి అనే నినాదంతో లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రూరల్ సర్పంచ్ అభ్యర్థిని గెలిపించుకుందాం

నగర మేయర్ రమేష్ గౌడ్



అనంతపురం, నవంబర్ 18 అక్షర మేధస్సు అనంతపురం రూరల్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైసీపీ మద్దతుతో పోటీ చేస్తున్న కొండేటి సునీతను గెలిపించుకుందామని నగర మేయర్ రమేష్ గౌడ్ సూచించారు. అనంతపురం రూరల్ వైసీపీ నేతలు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు బుధవారం నిర్వహించిన సమావేశానికి నగర మేయర్ రమేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమిష్టిగా పనిచేసి సర్పంచ్ స్థానంతోపాటు వార్డు అభ్యర్థులను గెలిపించుకుందామని సూచించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి ప్రజల మదిలో ఉందన్నారు. అదే సందర్భంలో రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వ వైఫల్యాల పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, మొన్నటి కార్పొరేషన్, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు మద్దతుగా నిలబడటమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి ఓటరును వ్యతిరేకంగా కలసి ఓట్లు అభ్యర్థించాలని గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై నాయకులు అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైసీపీ ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఎద్దుల అమర్ నాథ్ రెడ్డి,నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, వైసీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, కుంటిమద్ది రమేష్, హరి, మహేష్, నాగార్జున రెడ్డి, చింతకుంట మధు, బెస్త వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలుతో గ్రామాల్లో ఎన్నికల సందడి

పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా కొనసాగిన నామినేషన్ల స్వీకరణ



బుక్కరాయసముద్రం, నవంబర్ 18 అక్షర మేధస్సు అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని గోవిందపల్లి, జంతులూరు, చెదుళ్ల, నీలంపల్లి గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఉత్సాహంగా కొనసాగింది. వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు చేరుకుని ఎన్నికల అధికారులకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. దీంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలు చేపట్టి, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి రామమూర్తి, సీఐ సుబ్బరాయుడు, ఎంపీడీవో సల్మాన్ రాజ్ నాగేంద్ర రఫీ స్వర్ణలత భాగ్యశ్రీ సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు. అధికారులు, పోలీసుల సమన్వయంతో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది.

ఏపీని సెమీకండక్టర్ హబ్‌గా మారుస్తాం: మంత్రి లోకేశ్?

దేశంలోనే సెమీకండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఐటీ మంత్రి నారా లోకేశ్? ప్రకటించారు.



దేశంలోనే సెమీ కండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఐటీ మంత్రి నారా లోకేశ్? ప్రకటించారు. చిప్‌ల తయారీ నుంచి ప్యాకేజింగ్ వరకు ఏపీని గ్లోబల్ హబ్‌గా మారుస్తామని స్పష్టం చేశారు. సిలికాన్ ఫ్యాబ్‌లకు కేంద్రం, రాష్ట్రం కలిపి 80 శాతం పెట్టుబడి రాయితీ కల్పిస్తామన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం :

డిస్‌ప్లే, కాంపౌండ్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌లకు 70 శాతం వరకు ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. ఇందుకోసం సెమీకండక్టర్ పాలసీని రెండో దశ ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు అనుగుణంగా సవరించామన్నారు. తిరుపతిలో 5 వేల ఎకరాల్లో ప్రత్యేక సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, సింగిల్ విండో అనుమతులు కల్పిస్తామని చెప్పారు. పరిశోధన, ఆవిష్కరణలతో పాటు యువతకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ పొందే ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.10 వేలు ప్రోత్సాహకం ఇస్తామని ప్రకటించారు. భారత్ తన చిప్‌లను ఆంధ్రప్రదేశ్‌లోనే తయారు చేసే స్థాయికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. భారతదేశంలో చిప్ తయారీ ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసిందని మంత్రి లోకేశ్? అన్నారు. "భారతదేశ చిప్ తయారీ ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయాత్మక అడుగు వేసింది. మా ప్రభుత్వం సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0ను ప్రకటించింది. ఇందులో సిలికాన్ ఫ్యాబ్‌లకు కేంద్రం, రాష్ట్రం కలిపి 80 శాతం పెట్టుబడి రాయితీ కల్పిస్తాయి. ఇది దేశంలోనే అత్యధికం. ఒడిశా, తమిళనాడు 65 శాతం, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ 60 శాతం, గుజరాత్ 56 శాతం సహాయం అందిస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ 80 శాతం సహాయం అందిస్తోంది. డిస్‌ప్లే, కాంపౌండ్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌లకు 70 శాతం వరకు ప్రోత్సాహకాలు ఇస్తాం. ఇందుకోసం సెమీకండక్టర్ పాలసీని రెండో దశ ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు అనుగుణంగా సవరించాం.

విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభకు గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దవడుగూరు, నవంబర్ 18 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, మేధస్సు, కళా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు మండలంలో వివిధ పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయం పెద్దవడుగూరు ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, డ్రాయింగ్, క్రీడా పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, షేక్షావలి పోటీలను పర్యవేక్షిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు తమకు నచ్చిన అంశాలపై వ్యాసాలు రాస్తూ, చిత్రలేఖనంలో తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వం, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, ఉపాధ్యాయులు రామచంద్ర, గంగరాజు ఆధ్వర్యంలో పోటీలు కొనసాగాయి. వివిధ అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరుస్తూ వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాలలో సైతం వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు



నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉష, ఉపాధ్యాయురాలు ముత్యాలమ్మ విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు అవకాశం కలుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో పాఠ్యపుస్తకాల చదువుతో పాటు సాధారణ జ్ఞానం, సాహిత్యంపై ఆసక్తి, సృజనాత్మక ఆలోచన, క్రీడా నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేస్తూ పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపీపీ మెయిన్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలకు చెందిన మొత్తం 65 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం, ఆత్మవిశ్వాసం, విజ్ఞాన సముపార్జన పట్ల ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్న గ్రంథాలయ శాఖను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరానంద డిగ్రీ కళాశాలలో ఘనంగా ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

విజేతలకు ట్రోఫీలు అందజేసిన కరస్పాండెంట్ కే.సీ. హరికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ ఎం.వి. శ్రీనివాసన్

గుంతకల్ నవంబర్ 18 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి, గుంతకల్ పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల (అటానమస్)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు బుధవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ కే.సీ. హరికుమార్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ సెక్రటరీ ఎం.వి. శ్రీనివాసన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కే.సీ. హరికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు విద్యారంగంతోపాటు క్రీడారంగంలోనూ రాణించడం అభినందనీయమన్నారు. కళాశాల స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో పోటీల్లో ఆతిథ్య కళాశాల జట్లు విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. స్పోర్ట్స్ సెక్రటరీ ఎం.వి. శ్రీనివాసన్ మాట్లాడుతూ విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొని



ప్రతిభను చాటుకోవాలని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు.

వివిధ క్రీడాంశాల్లో విజేతలు:

ఖోఖో పోటీల్లో గుంతకల్ ఎస్.ఎస్.జి.ఎస్. ఎయిడెడ్ డిగ్రీ కళాశాల విజేతగా నిలవగా, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. కబడ్డీలో గుంతకల్ ఎస్.ఎస్.జి.ఎస్. డిగ్రీ కళాశాల విజేతగా, అనంతపురం ఎస్.కే.యూ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అనంతపురం కే.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజేతగా, ధర్మవరం కే.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో అనంతపురం ఎస్.ఎస్.బి.ఎన్. డిగ్రీ కళాశాల విజేతగా, కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలిచాయి. టేబుల్ టెన్నిస్‌లో కదిరి ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజేతగా, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో అనంతపురం ఎస్.ఎల్.ఎన్. డిగ్రీ కళాశాల విజేతగా, అనంతపురం ఎస్.కే.యూ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సురేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ మహమ్మద్ భాషా, అధ్యాపకులు టీ. వెంకటరమణ, బసెట్టి క్రిష్టయ్య, ఖాజావలి, కృష్ణానంద, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరామ్, నరసింహాచారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఉత్సాహభరితంగా సాగిన క్రీడా పోటీలు విజయవంతంగా ముగియడంతో కళాశాల యాజమాన్యం, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

నామినేషన్ల ప్రక్రియలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు బెదిరింపులు, దాడులులి

లిఅడ్డుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

--ఆర్వోకు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదులి

లిఅభ్యర్థులకు పోలీసు రక్షణ కల్పించి స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా చూడాలిలి

గుంతకల్, నవంబర్ 18 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి: గుంతకల్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాజకీయంగా వేడెక్కుతోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేయాలనుకుంటున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను టీడీపీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు గురిచేస్తున్నారని, నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటూ దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులపై బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు.



గ్రామాల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని, ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గుంతకల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మలోలను కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లి, అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

వృద్ధ మహిళ హత్య కేసులో నిందితుడు ఆకుతోట అద్దెప్ప అరెస్ట్

తల్లి గొంతుకు తాడు బిగించి హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి

గుంతకల్, నవంబర్ 18 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి: గుంతకల్ పట్టణంలోని వాల్మీకి సర్కిల్, దోనిముక్కల రోడ్డులో నివాసం ఉంటున్న వృద్ధ మహిళ ఆకుతోట సుంకలమ్మ హత్య కేసులో నిందితుడు ఆకుతోట అద్దెప్పను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకలమ్మ కుమారుడైన అద్దెప్ప, తన సోదరుడు నగేష్ లారీ ప్రమాదంలో మరణించడంతో వచ్చే ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు, తన తల్లి పేరున ఉన్న ఇంటిని కూడా తన పేరుపై రాయాలని ఒత్తిడి చేసేవాడని తెలిపారు. ఈ విషయమై ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి తల్లిని కొడుతూ, చంపేస్తానని బెదిరించేవాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో నవంబర్ 16వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన తల్లి సుంకలమ్మ గొంతుకు తాడుతో బిగించి హత్య చేసి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ ఘటనపై



మృతురాలి పెద్ద కుమార్తె చెన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంతకల్ పోలీసులు వెల్లడించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 110/2026, సెక్షన్ 103(1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుంతకల్ ఎస్‌డీపీఓ రాజశ్రీ పర్యవేక్షణలో గుంతకల్ రూరల్ సీఐ ఎం. రామారావు, ఎస్ఐ కె. బాలముని మరియు పోలీసు సిబ్బంది నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో గుంతకల్ పట్టణంలోని హనుమాన్ సర్కిల్, ఆలూరు రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో నిందితుడు ఆకుతోట అద్దెప్పను గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని గుంతకల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు

ఏపీలో రేపు ఎంపీపీ, ఎల్లుండి జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఆరోజు నుంచే పదవీకాలం స్టార్ట్

ఏపీలో రేపు (గురువారం) ఎంపీపీలతో పాటు వైస్ ఎంపీపీలను ఎంపీటీసీలు ఎన్నుకోనున్నారు. ఎల్లుండి 28 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను జడ్పీటీసీలు ఎన్నుకోనున్నారు.

ఏపీలో మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ)ల ఐదేళ్ల పదవీకాలం రేపటి తొలి సమావేశం నుంచి ఆరంభం కానుంది. ఈ మేరకు రేపు (గురువారం) పరోక్ష పద్ధతిలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలను ఎంపీటీసీలు ఎన్నుకోనున్నారు. మరోవైపు 28 జిల్లా ప్రజాపరిషత్?ల (జడ్పీ) పదవీ కాలం ఈనెల 20న (శుక్రవారం) నుంచి ఆరంభమవుతుంది. ఇందుకోసం పరోక్ష పద్ధతిలో జడ్పీ చైర్మన్, వైస్?చైర్మన్?లను జడ్పీటీసీలు ఎన్నుకుంటారు. వీరి ఐదేళ్ల పదవీ కాలం ఆరోజు నుంచి లెక్కిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఇవాళ నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రంలో 659 మండలాల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో కొన్ని ఏకగ్రీవాలు కాగా 9000లకు పైచిలుకు ఎంపీటీసీలకు, 659 జడ్పీటీసీలకు ఈ నెల 5న పోలింగ్ జరగ్గా, తుపాను ప్రభావం, రీ-పోలింగ్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 6న పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఈ నెల 7న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక, అదే మాదిరిగా జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో-అప్టెడ్ సభ్యుల ఎంపిక కోసం ప్రత్యేక సమావేశాల తేదీలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్?ఈసీ) ఇప్పటికే ప్రకటించింది. ఆ ప్రకారమే తాజాగా ఇవాళ నోటిఫికేషన్? వెలువరించింది. ఇందులో భాగంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికార్లను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్?ఈసీ) ఆదేశించింది. మరోవైపు జిల్లా కలెక్టర్లు మండల స్థాయిలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని తెలిపింది. ఆ అధికారే ఈ పరోక్ష ఎన్నికలను నిర్వహించాలని నిర్దేశించింది. ఈ మేరకు రేపు (గురువారం) ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ ఎన్నికల కోసం ఉదయం 10 గంటలకు నామినేషన్లు తీసుకుంటారు. పదకొండు గంటలకు పరిశీలన పూర్తి



తెలంగాణలో పోలీసు పదోన్నతులకు లైన్ క్లియర్

డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో కీలక ముందడుగు

తెలంగాణ పోలీసు శాఖలో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రమోషన్లకు లైన్ క్లియర్ అయింది

డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో మార్గం సుగమమైంది



తెలంగాణ పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతులకు (ప్రమోషన్లు) మార్గం సుగమమైంది. డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవతో ఇందుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. కోర్టుల్లో కేసులకు స్వస్తి పలికే దిశగా అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చారు. 1991, 1995, 1996 బ్యాచ్‌ల సివిల్ ఎస్సై (ప్రస్తుతం డీఎస్పీలు, అదనపు ఎస్పీలు)లతో మంగళవారం డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష నిర్వహించారు.సీనియారిటీకి సంబంధించిన వివాదాలు, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్‌వోఆర్), ఖాళీలు, అర్హతలపై నెలకొన్న విభేధాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకొనేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. కోర్టుల్లో కేసులు, వివాదాల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.74 ప్రకారం ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా సీనియారిటీ జాబితాపై కొంతమంది అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కమిటీ నివేదిక, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలపై సమావేశంలో డీజీపీ సమీక్షించారు. రెండు దశల్లో పదోన్నతులు కల్పించాలని యోచిస్తున్నారు.మొదటి దశలో 54 మంది డీఎస్పీ/ఏసీపీ స్థాయి అధికారులకు అడీషనల్ ఎస్పీలు/అదనపు డీసీపీలుగా పదోన్నతులు కల్పించేందుకు పోస్టులు అందుబాటులో ఉన్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ వివరించారు. రెండోదశలో వచ్చే సంవత్సరం ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రతిపాదిత జాబితాల ప్రకారం ముందుకు వెళ్లేందుకు ఆయా బ్యాచ్‌లకు సంబంధించిన అధికారులు అంగీకరించారు.అలానే 12 నాన్‌కేడర్ ఎస్పీ పోస్టులపై న్యాయపరమైన వివాదాలేవీ లేనందువల్ల వాటిని తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. వీటితోపాటు ప్యానల్ ఇయర్‌లో మరో 10 నాన్‌కేడర్ ఎస్పీ పోస్టులు కేటాయించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పోలీసు అధికారుల పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని డీజీపీ తెలిపారు. సమావేశంలో మహిళా భద్రత విభాగం డీజీ సౌమ్యమిశ్రా, హైదరాబాద్ సీపీ మహేశ్‌భగవత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.డీజీపీ సీవీ ఆనంద్ ఇప్పటికే పలుమార్లు 1995, 96 బ్యాచ్‌ల అధికారులతో సమావేశం నిర్వహించారు. వివాదం కొనసాగుతున్నంత కాలం పదోన్నతులు జరగకపోతే అందరికీ అన్యాయం జరుగుతుందని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశారు. దీంతో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యగా పరిష్కారం లభించనుంది.

ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్

రూ.1000 కోట్లతో పూర్తి చేసేందుకు గెయిల్ అంగీకారం

రాష్ట్రంలో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా ప్రాజెక్టు పట్టాలెక్కనుంది

ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును భరించేందుకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్-గెయిల్ అంగీకరించింది.



రాష్ట్రంలో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కనుంది. ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు సుమారు వేయి కోట్లను భరించేందుకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్-గెయిల్ అంగీకరించింది. కృష్ణా-గోదావరి బేసిన్‌లో గ్యాస్ వెలికి తీసి పైప్‌లైన్‌తో ఏపీ, ఒడిశాలోని పలు జిల్లాల్లో ఉన్న పరిశ్రమలు, అర్బన్ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లు, ప్రాంతీయ ఇంధన కేంద్రాలకు సరఫరా చేసేందుకు కేంద్రం ఈ ప్రాజెక్టు చేపట్టింది. ప్రధానమంత్రి ఊర్జ్ గంగా పైప్‌లైన్ కింద దీన్ని 2022లో అనుమతించింది. అప్పట్లో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి.ఈ ప్రాజెక్టు కింద శ్రీకాకుళం-విశాఖ మధ్య పైప్‌లైన్ నిర్మించాలి. కానీ వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంతో ప్రాజెక్టు అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు జరిపి, తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. పైప్‌లైన్ ఏర్పాటుకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది.ఈ ప్రాజెక్టు కింద మొత్తం 965 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించాల్సి ఉంది. దీనికి 2 వేల 650 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేసి, ఒడిశాలోని దామ్రా నుంచి శ్రీకాకుళం వరకు సుమారు 516 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి చేశారు. శ్రీకాకుళం నుంచి కాకినాడ వరకు సుమారు 320 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. కాకినాడ-విశాఖపట్నం మధ్య 188 కిలోమీటర్లు, శ్రీకాకుళం-విశాఖపట్నం మధ్య 112 కిలోమీటర్ల పైప్‌లైన్, 2 దశల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ అభివృద్ధి చేయడం ద్వారా ఏపీ, ఒడిశాలోని పలు జిల్లాల్లో ఇళ్లు, పరిశ్రమలు, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్‌కు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఒప్పందం మేరకు నిధులను గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం కేటాయించకపోవడంతో రాష్ట్రంలోని పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.2022లో ప్రాజెక్టు చేపట్టిన తర్వాత 350 కోట్ల రూపాయలతో పైప్‌లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. గెయిల్ భాగస్వామ్యంతో పనులు నిర్వహించేందుకు ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేసింది. ఆ తర్వాత మిగిలిన నిధులు విడుదల చేయకపోవడం, పనులు జాప్యం కావడంతో కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు 2023లో ప్రాజెక్టును రద్దు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు తిరిగి చేపట్టేందుకు వీలుగా కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్ర వాటా మొత్తాన్ని భరించే పరిస్థితి లేదని కేంద్రానికి తెలిపింది. దీనిపై సంప్రదింపుల తర్వాత ప్రాజెక్టు తిరిగి ప్రారంభించేందుకు కేంద్రం అనుమతించడంతో పాటు వ్యయం మొత్తాన్ని గెయిల్ భరించేలా నిర్ణయించింది.రాష్ట్ర ప్రభుత్వంతో ప్రాజెక్టు పనులపై చర్చించేందుకు గెయిల్‌కు చెందిన ఉన్నతస్థాయి అధికారుల బృందం త్వరలో ఏపీ రానుంది. గతంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ఇంజినీర్ల బృందం పరిశీలించి వినియోగించుకునేందుకు ఏ మేరకు అవకాశం ఉందనే దానిపై నిర్ణయం తీసుకుంటుంది. ఒకవేళ పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతిన్నట్లయితే, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుంది. పైప్‌లైన్ అందుబాటులోకి వస్తే విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం, వివిధ పరిశ్రమలకు అవసరమైన గ్యాస్ పైప్ లైన్ ద్వారా అందించడం సాధ్యమవుతుంది. దీంతో పాటు కాకినాడ పరిధిలో కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలు, ప్రాంతీయ ఇంధన కేంద్రాలకు గ్యాస్ రవాణాకు ఉన్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

అమరావతి ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై విచారణ

పిటిషనర్ వాదనను తోసిపుచ్చిన హైకోర్టు

అమరావతి ఓఆర్ఆర్ విజయవాడ సౌత్‌ఈస్ట్, నార్త్‌ఈస్ట్ అలైన్‌మెంట్‌లను నిర్ణయించడంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు పలు అంశాలను విస్మరించారంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి



అమరావతి ఓఆర్ఆర్ విజయవాడ సౌత్‌ఈస్ట్ , నార్త్‌ఈస్ట్ అలైన్‌మెంట్‌లను సవాలు చేస్తూ కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూర్ గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు కనిగంటి ఆంజనేయ ప్రసాద్ వేసిన పిల్ పై హైకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా కోర్టుకు చెప్పిన వివరాలను రాతపూర్వకంగా తమ ముందు ఉంచాలని ఎన్‌హెచ్ఏఐ తరపు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది. మరోవైపు ఈనెల 19న టెండర్లు తెరవబోతున్నారని, ఈ ప్రక్రియను నిలువరించాలని పిటిషనర్ తరపు న్యాయవాది చేసిన అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది.అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు విజయవాడ సౌత్‌ఈస్ట్, నార్త్‌ఈస్ట్ అలైన్‌మెంట్లను నిర్ణయించే విషయంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు పలు అంశాలను విస్మరించారంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టులోవాదనలు ముగిశాయి. విచారణ సందర్భంగా కోర్టుకు చెప్పిన వివరాలను రాతపూర్వకంగా తమ ముందు ఉంచాలని ఎన్‌హెచ్ఏఐ తరపు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది. మరోవైపు ఈనెల 19న టెండర్లు తెరవబోతున్నారని ఈ ప్రక్రియను నిలువరించాలని పిటిషనర్ తరపు న్యాయవాది చేసిన అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.అమరావతి ఓఆర్ఆర్ విజయవాడ సౌత్‌ఈస్ట్ , నార్త్‌ఈస్ట్ అలైన్‌మెంట్‌లను సవాలు చేస్తూ కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూర్ గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు కనిగంటి ఆంజనేయప్రసాద్ హైకోర్టులో పిల్ వేశారు. 'అలైన్‌మెంట్ నిర్ణయానికి ముందు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు రూపొందించకుండా అడ్మినిస్ట్రేటివ్ అప్రూవల్ కమిటీ ఆమోదం తీసుకోకుండా ఓఆర్ఆర్ ప్రాజెక్ట్‌కు టెండర్లు పిలిచారని కోర్టులో వాదించారని పరిపాలనా పరమైన అనుమతులు లేవన్నారు. క్యాబినెట్ ఆమోదం లేదని కోర్టుకు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం సూచించిన అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారన్నారు.ఓఆర్ఆర్ ఆగ్నేయ, ఈశాన్య అలైన్‌మెంట్ రాష్ట్ర, రాజధాని అమరావతి ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందన్నారు. నైరుతి, వాయువ్య కారిడార్ అలైన్‌మెంట్లతో పోలిస్తే ఆగ్నేయ, ఈశాన్య అలైన్‌మెంట్ నిర్ణయంతో ఓఆర్ఆర్ రహదారిని 10 కి.మీ లోపలకు జరిపారన్నారు. రాజధాని అమరావతిని కేంద్రంగా తీసుకొని ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను నిర్ణయించాల్సి ఉండగా విజయవాడను కేంద్రంగా తీసుకున్నారన్నారు. అలైన్‌మెంట్ల నిర్ణయం భవిష్యత్తు తరాలకు ప్రయోజనం కలిగించేలా దూర దృష్టితో ఉండాలన్నారు. అందుకు భిన్నంగా అలైన్‌మెంట్లు ఉన్నాయి. ఈనెల 19న టెండర్లు తెరవబోతున్నారు. ఈ ప్రక్రియను నిలువరించాలని హైకోర్టును కోరారు.ఎన్‌హెచ్ఏఐ తరపు న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. రాష్ట్ర విభజన చట్టంలోని నిబంధనల ప్రకారం ఏపీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందులో భాగంగా అమరావతి ఓఆర్ఆర్‌ను కేంద్రం చేపట్టిందని తెలిపారు. రాజధాని అమరావతి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓఆర్ఆర్ అలైన్‌మెంట్లను నిర్ణయించారు. స్థిరాస్తి వ్యాపారులకు ప్రయోజనం చేసేందుకు అలైన్‌మెంట్లను నిర్ణయించారని పిటిషనర్ ఆరోపణ చేయడం తప్ప ఆధారాలను కోర్టుకు ఇవ్వలేదన్నారు. రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఎలా ఉండాలని పిటిషనర్ నిర్ణయించలేరని తెలిపారు.అనధికారిక లేఅవుట్లకు నష్టం జరగకుండా చూసేందుకు పిటిషనర్ పిల్ వేసినట్లు అనుమానం కలుగుతోందన్నారు. డీపీఆర్ ఆమోదం పొందిన తర్వాతే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలని పిటిషనర్ చేస్తున్న వాదన సరికాదన్నారు. ప్రాజెక్ట్ పనుల పురోగతి ఆధారంగా వివిధ దశల్లో డీపీఆర్ రూపుదిద్దుకుంటుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రాజెక్ట్‌కు సాంకేతిక అనుమతులు లభించాయని క్యాబినెట్ నుంచి లాంఛనప్రాయమైన అనుమతి లభించాల్సి ఉందన్నారు. ఇలాంటి విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

వాహనదారులకు గుడ్ న్యూస్

మూడేళ్ల తర్వాత మళ్లీ ఆర్సీ, డీఎల్ కార్డుల జారీ

ఏపీలో నిలిచిపోయిన ఆర్సీ, డీఎల్ కార్డుల పంపిణీ మళ్లీ మొదలైంది

55 లక్షల పెండింగ్ కార్డులను 6 నెలల్లో పంపిణీ చేయనున్నారు



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాహనదారులకు రవాణా శాఖ శుభవార్త చెప్పింది. మూడేళ్లుగా నిలిచిపోయిన డ్రైవింగ్ లైసెన్స్ (ఙూ), వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (=జ) కార్డుల పంపిణీని మళ్లీ ప్రారంభించింది. ఈ స్మార్ట్ కార్డుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సుమారు 55 లక్షల మందికి భారీ ఊరట లభించింది. టెండరు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ఈ కార్డుల ముద్రణను వేగవంతం చేసింది. గత రెండు రోజుల నుంచి ఈ కార్డుల్లో వివరాలు ముద్రించి, నేరుగా పోస్టులో పంపే చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలోనే ఈ పెండింగ్ కార్డులన్నీ దరఖాస్తుదారుల ఇళ్లకు చేరుకోనున్నాయి.వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఈ కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరిగింది. సకాలంలో కార్డులు జారీ చేయకపోవడంతో వాహనదారులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డారు. పరిస్థితి చేయిదాటడంతో 2023 ఆగస్టు ఒకటి నుంచి వీటి జారీని రవాణా శాఖ పూర్తిగా ఆపేసింది. అంతేకాకుండా వీటి కోసం వసూలు చేసే ఫీజులను కూడా నిలిపివేసింది. దీంతో కొత్తగా వాహనాలు కొన్నవారు, లైసెన్సులు పొందిన వారు స్మార్ట్ కార్డులు లేక తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో సరైన పత్రాలు చూపించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాహనదారుల సమస్యపై దృష్టి సారించింది. 2024 అక్టోబరు నుంచి ఆర్సీ, డీఎల్ కార్డులు మళ్లీ జారీ చేయాలని పక్కా నిర్ణయం తీసుకుంది. కార్డుల సరఫరా, ముద్రణ, ఇంటికి పోస్టులో పంపేందుకు పారదర్శకంగా టెండర్లు పిలిచింది. ఇందులో 'రోస్‌మెర్టా' అనే సంస్థ ఆగస్టులో బిడ్ దక్కించుకుంది. ఈ కార్డుల జారీ కోసం రవాణాశాఖ దరఖాస్తుదారుల నుంచి రూ.235 వసూలు చేస్తోంది. ఇందులో స్మార్ట్ కార్డు ధర కింద రూ.200, పోస్టల్ ఛార్జీల కింద రూ.35 తీసుకుంటున్నారు.టెండర్ దక్కించుకున్న సంస్థ సోమవారం నుంచి కార్డుల ముద్రణను అధికారికంగా మొదలుపెట్టింది. రవాణాశాఖలోని రీజనల్ కార్యాలయాల వారీగా ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాల్లో కార్డుల ముద్రణ సాగుతోంది. ప్రింట్ అయిన కార్డులను ఎప్పటికప్పుడు పోస్టల్ శాఖ ద్వారా దరఖాస్తుదారుల చిరునామాలకు పంపుతున్నారు. అయితే మొత్తంగా 55 లక్షల పెండింగ్ కార్డులు ఉండటంతో ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టనుంది. ఇవన్నీ ముద్రించి, పోస్టులో పంపేందుకు సుమారు 6 నెలల వరకు సమయం పడుతుందని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా కార్డుల జారీ మళ్లీ మొదలుకావడంతో ఏపీలోని వాహనదారుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జనవరి నుంచి నీటి సరఫరాపై ప్రభావం

సమన్వయంతో సమస్యను ఎదుర్కొనేలా కొత్త ప్లాన్

వర్షాభావ పరిస్థితులతో హైదరాబాద్‌లో నీటికొరతపై జలమండలి, మూడు కార్పొరేషన్లు, భూగర్భజలశాఖ, హైడ్రా, పీసీబీ, సమాచార శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది



ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో జనవరి నుంచి నగర నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడనుండటంతో ప్రభుత్వం కొత్త ప్రణాళికను అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. జలమండలితోపాటు హైదరాబాద్ మహానగరంతో ముడిపడి ఉన్న కీలక శాఖలన్నింటికీ బాధ్యతలు అప్పగించింది. జలమండలి, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, భూగర్భ జలశాఖ, హైడ్రా, కాలుష్య నియంత్రణ మండలి, సమాచార శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కంటెంజెన్సీ మానిటరింగ్ కమిటీకి జలమండలి ఎండీ అశోక్ రెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్, నీటిపారుదల, కార్యదర్శులు, క్యూర్ (హైదరాబాద్) పరిధిలో మూడు కార్పొరేషన్ల కమిషనర్లు, హెచ్ఎండీఏ, హైడ్రా కమిషనర్లు, భూగర్భ జలశాఖ, పీసీబీ డైరెక్టర్లు ఇందులో మెంబర్లుగా వ్యవహరించనున్నారు.నీటి సరఫరా సమన్వయం, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మ్యాపింగ్, డిమాండ్‌ను నమోదు చేయడం, డిజిటల్ ప్లాట్‌ఫాంను నిర్వహించడం వంటివి చేస్తుంది. డైల్-ఎ-గ్రీన్ ట్యాంకర్ సేవలు, గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నగరంలో వివిధ ప్రాంతాలకు ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటిని సరఫరా, ఎస్టీపీల నీటి నాణ్యతా ఫలితాలను వెల్లడిస్తుంది.పీపీపీ విధానంలో నడిచే ఎస్టీపీల నీటి నాణ్యత పర్యవేక్షించడం, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు, క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) చట్టం-2026 లోని సెక్షన్ 241, 242 మేరకు తనిఖీలు, ఇతర శాఖలకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సహాయం అందించడం. నాలాలు, చెరువులు, వాటి రీఛార్జ్ జోన్లను ఆక్రమణలు, కాలుష్యం నుంచి సంరక్షించే బాధ్యతలను నిర్వహిస్తుంది.వాల్టా చట్టం-2002 ప్రకారం కొత్తగా బోర్ల అక్రమ తవ్వకాలు, భూగర్భ జలాల అక్రమంగా వినియోగం, వాడకాన్ని వంటి వాటిని నియంత్రించడం. క్యూర్ ప్రాంతంలో భూగర్భ జల మట్టాల విశ్లేషించి సమాచారం తీసుకోవడం. కొత్త బోర్లకు అనుమతి ఇవ్వడం.హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగరపాలక సంస్థలు, హెచ్ఎండీఏ వారి పరిధిలోని 100 ఎంఎల్‌డీల కంటే తక్కువ సామర్థ్యం గల ప్రైవేట్ ఎస్టీపీలను మానిటరింగ్ చేయడం. కొత్త భవన నిర్మాణ అనుమతుల్లో ఎస్టీపీల ఏర్పాటు, శుద్ధి చేసిన మురుగు నీటిని అవసరాలకు వినియోగించేలా నిబంధనలను అమలు చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ఏర్పాటు చేయడం. వాటిపై అవగాహన కల్పించడం.100 ఎంఎల్‌డీ అంతకంటే ఎక్కువ సామర్థ్యం గల ఎస్టీపీలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించడం. నాణ్యతా ప్రమాణాలను పక్కాగా నియంత్రించడం. చట్టపరంగా రెగ్యులేటరీ చర్యలు తీసుకోవడం.జలమండలితో కలిసి నీటి సంరక్షణ, నీటిభద్రత, గ్రీన్ ట్యాంకర్ల వినియోగంపై అవగాహన కల్పించడం. ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం. దీనికి అవసరమైనటువంటి సమాచారాన్ని చేరవేయడం.

విజయవాడ చెంతనే బుల్లెట్ రైలు!

13 కిలోమీటర్ల దూరంలోనే అమరావతి హైస్పీడ్ స్టేషన్

అమరావతి రైల్వే స్టేషన్‌ను విజయవాడకు కేవలం 13 కిలోమీటర్ల దూరంలోనే నిర్మించనున్నారు

రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ కార్పొరేషన్ సమ్మతించింది



బుల్లెట్ రైళ్ల పరుగులు పెట్టేలా నిర్మించనున్న హైస్పీడ్ రైల్ కారిడార్‌లో అమరావతి రైల్వే స్టేషన్‌ను విజయవాడకు కేవలం 13 కిలోమీటర్ల దూరంలోనే నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ కార్పొరేషన్ సమ్మతించింది. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నై వెళ్లే ఈ కారిడార్ విజయవాడకు దూరంగా ఉంటే, నగరవాసులు బుల్లెట్ రైల్ కోసం స్టేషన్‌కు చేరుకోవడానికి రోడ్డు మార్గంలో వాహనాల్లో సుదూర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీనికి బదులు వీలైనంత తక్కువ దూరంలో ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందుకే విజయవాడకు 13 కిలోమీటర్ల దూరంలోనే అందుబాటులో ఉండేలా అమరావతి స్టేషన్‌ను ప్రతిపాదించారు. హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్ ఏపీలోని దాచేపల్లి, అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి మీదుగా చెన్నైకి చేరుకుంటుంది. హైదరాబాద్--అమరావతి--చెన్నై కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు కాగా, ఇందులో 518 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తుంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు మంజూరు చేసింది. అయితే, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలైన్‌మెంట్ విషయంలో ఇంకా ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. శంషాబాద్, భారత్ సిటీ, డ్రైపోర్ట్, హాలియా, వాడపల్లి మీదుగా ఈ కారిడార్ ఏపీలోకి ప్రవేశించేలా ఓ ఎలైన్‌మెంట్‌ను ప్రతిపాదించారు. ఇది హైదరాబాద్‌కు దూరమవుతుందని, ఈ కొత్త మార్గంలో కారిడార్ ఎందుకు అనేవాదన ఉండటంతో ఎలైన్‌మెంట్‌పై తేల్చడం లేదని తెలిసింది.తెలంగాణ ప్రభుత్వం నుంచి దీనిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎనూ=జూ) అధికారులు ఫైనల్ లొకేషన్ సర్వే (ఖీూ), డీపీఆర్ తయారీని కూడా ప్రస్తుతానికి పక్కనపెట్టారు. ఏ మార్గంలో కారిడార్ వెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకున్నాక ఎఫ్ఎల్ఎస్ చేద్దామనే ఉద్దేశంతో ఉన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల రైల్వే బోర్డుకు తెలియజేసింది. దీనిపై బోర్డు స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు.చెన్నై-బెంగళూరు కారిడార్ విషయంలోనూ ఇదే విధంగా సందిగ్ధత నెలకొంది. గతంలో తమిళనాడు ప్రభుత్వం పెరందూరు వద్ద విమానాశ్రయం నిర్మించాలని భావించింది. దీంతో చెన్నై-చిత్తూరు-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ ఆ విమానాశ్రయానికి దగ్గరగా వెళ్లేలా ప్రతిపాదించారు. అయితే ఈ ఏడాది మే నెలలో అక్కడ ఏర్పడిన కొత్త ప్రభుత్వం, విమానాశ్రయ ప్రతిపాదనను పెరందూరు నుంచి మరో చోటుకు మార్పు చేసింది. దీంతో హైస్పీడ్ రైల్ కారిడార్ ఎటు నిర్మించాలనే దానిపై స్పష్టత లేదు.హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్ తిరుపతి మీదుగాను, చెన్నై-బెంగళూరు కారిడార్ చిత్తూరు మీదుగా వెళ్లేలా ప్రణాళిక ఉండటంతో ఈ కారిడార్లకు అనుసంధానం ఉండేలా తిరుపతి-చిత్తూరు మధ్య లింక్ కారిడార్ నిర్మించాలని ఏపీ ప్రభుత్వం గతంలో కోరింది. దీనికి కేంద్రం సమ్మతి తెలిపి, ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించింది. ఇప్పుడు చెన్నై-బెంగళూరు కారిడార్ ఎలైన్‌మెంట్‌పై స్పష్టత లేకపోవడంతో, ఏపీ ప్రభుత్వం కోరిన తిరుపతి-చిత్తూరు లింక్ కారిడార్ ప్రతిపాదన తాత్కాలికంగా ఆగింది.

Editor, Published & Owned By:N RANGANATH & Printed at M/S Achukatla Publications, # 9/1542, M.R.Road, Gooty R.S., Gooty - 515402, Ananthapuramu District. Andhra Pradesh. Published at # 1-3,Gajarampalli Village & Post, Pamidi Mandal, Pamidi - 515775 Ananthapuramu District. Andhra Pradesh. E-Mail:editorranganath@gmail.com
Cell: 8466071258 P.R.G.I. Regd. No:APTEL/26/A8343